
# 'రోమియో'



"అమ్మా, నేను కాలేజీకి వెళుతున్నాను" అంటూ పుస్తకాలు చేతిలోకి తీసుకొని బయటికి నడిచింది వసుధ.

బస్‌స్టాండ్‌లో చాలా మంది జనం నిల్చొని ఉన్నారు. అందులో కాలేజీ కుర్రాళ్లు, అమ్మాయిలు, ఉద్యోగానికి వెళ్లే ఉద్యోగులు, ఏదో పనుల మీద వెళ్లే మరికొందరు, అసలు ఏమీ తోచక బస్‌స్టాండులో నిల్చునే కుర్రకారు ఉన్నారు.

వసుధ కాలేజీకి వెళ్లే బస్సు వచ్చింది. జనం పరుగు పరుగున బస్సు దగ్గరకు వెళ్లారు.

దిగేవాళ్లు దిగుతూనే ఉన్నారు, ఎక్కేవాళ్లు పక్క నుండి ఎక్కేస్తూనే ఉన్నారు.

ఆ జనాన్ని తోసుకుంటూ వెళ్లలేక అక్కడే నిలుచుండిపోయింది వసుధ. ఆ బస్ వెళ్లిన

తరువాత బస్‌స్టాప్‌లో కొంత జనం తగ్గారు. మళ్లీ వచ్చే బస్సు కోసం ఎదురుచూస్తూ నిల్చుండిపోయింది.

ఆమె వెనుకగా కొంతదూరంలో ఓ వ్యక్తి ఆమెను ఏకదీక్షగా చూస్తున్నాడు. అనుకోకుండా వసుధ ఆ వ్యక్తి వేపు చూసింది. ఆమె వేపు అతను కళ్లు ఆర్పకుండా చూస్తున్నాడు. ఆ వ్యక్తికి సుమారు పాతిక సంవత్సరాల వయసు ఉంటుంది. హిందీ యాక్టర్ కబీర్ బేడిలా గెడ్డం పెంచాడు. షోకుగా తయారయ్యాడు. చేతిలో సిగరెట్ స్టైల్‌గా పట్టుకుని ఉన్నాడు. వసుధ వెంటనే తలదించుకొని బస్సు రాక కోసం ఎదురుచూస్తుండిపోయింది.

వాళ్ల కాలేజీల్లో ఉన్న కొద్దిమంది అందగత్తెల్లో వసుధ కూడా ఒకతె. వాళ్ల క్లాసులో ఆమె అందమైందని తన క్లాస్‌మేట్స్ అంటూ ఉంటారు. అంతేకాదు కాలేజీలో అబ్బాయిలు సైతం ఆమెతో మాట్లాడ్డానికి ఉబలాటపడుతుంటారు. కొందరు ఆమె అందమైన ముఖాన్ని చూసి ఆనందపడితే, మరికొందరు ఆమె పర్సనాలిటీని చూసి ఇదైపోతుంటారు.

అప్పుడప్పుడూ ఆమె తన ఫ్రెండ్స్‌తో వెళుతున్నప్పుడు రోడ్డు మీద పోకిరీ కుర్రాళ్లు "హాయ్ బ్యూటీ" అంటూ దూరం నుండే పిలుస్తుంటారు. అందరి ఆడపిల్లల్లాగే వసుధ కూడా అలాంటివి పట్టించుకోకుండా తలదించుకొని పోతూ ఉంటుంది.

వసుధ తండ్రి ఓ ప్రభుత్వ కార్యాలయంలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. ఆమె తరువాత ఇంకా ముగ్గురు పిల్లలు. అందరినీ ఎంతో కొంత చదివించాలి కదా - అందుకని టెన్త్ పాసయిన తరువాత చదువు మానిపించేస్తాను అన్నాడు ఆమె నాన్న. అయితే వాళ్ల అమ్మ పట్టుదలతో వసుధని కాలేజీలో చేర్పించాడు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి తెలిసిన వసుధ బస్సులో తప్ప ఆటోలో ఎప్పుడూ వెళ్లేది కాదు.

కాలేజీకి వెళ్లే బస్సు రానే వచ్చింది. వసుధ ఎలాగైతేనేం ఆ బస్సులో ఎక్కగలిగింది.

**రెండవ రోజు**


యథాప్రకారం బస్‌స్టాండ్‌కి వచ్చి నిల్చుంది. మళ్లీ నిన్నటి కుర్రాడే ఆమె వెనుకే నిల్చుని ఉన్నాడు. వసుధ అతన్ని గమనించింది. అతడు ఆమె వంక చూసి చిన్నగా నవ్వాడు. వసుధకు ఒక్కసారిగా ఒళ్లు మండింది. 'వెధవ, పని పాటా లేనట్టుంది, నా వెంటపడ్డాడు రోగ్' అని మనసులోనే తిట్టుకుంది.

అంతలో ఆమె ఫ్రెండ్ జయ వచ్చి పలకరించింది. "మేము ఇల్లు మారి మీ ఇంటి దగ్గరే ఉన్న నాలుగో ఇంట్లో అద్దెకు దిగాము. రేపటి నుండి నేనూ, నువ్వూ కలిసి కాలేజీకి వెళ్లొచ్చు" అంది ఆనందంగా.

"రక్షించావు, సమయానికి వచ్చావు" అంది వసుధ.

"అదేమిటి నేను రక్షించటం ఏమిటి!" అర్థంగాక అడిగింది జయ

"మన వెనుక చూడు, రెడ్ షర్ట్, బ్లాక్ జీన్స్ టక్




చేసుకొని ఉన్నాడే వాడు రోజూ నా వెంట పడుతున్నాడు. ఇక్కడ నేను బస్సు ఎక్కేవరకు నిల్చుని కొరికేసేలా చూస్తుంటాడు" అని మెల్లగా చెప్పింది వసుధ.

జయ క్రీగంటగా ఆ వ్యక్తిని చూసి అంది. "చూస్తే చూశాడులేవే, నువ్వు అందంగా ఉన్నావు. పాపం దేవదాను - నిన్ను చూసి పిచ్చోడయ్యాడు" అని పకపక నవ్వింది.

"ఏయ్ ఏమిటే నువ్వు కూడాను" మందలించింది వసుధ.

బస్ వచ్చింది. ఇద్దరు బస్సెక్కారు.

అతడు మెల్లగా వెనుదిరిగి వెళ్లిపోయాడు.

**మూడవ రోజు**

జయ, వసుధ కలిసి బస్‌స్టాండ్‌కు వచ్చారు. ఎదురుగా ఆ వ్యక్తి కనబడ్డాడు. వసుధ గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది.

"చూడవే వాడు, మళ్లీ కాపు కాచాడు" అంది వసుధ.

అంతలో బస్సు వచ్చింది. ఇద్దరూ బస్ ఎక్కారు. అతను కూడా వాళ్ల వెంటే బస్సు ఎక్కాడు. ఈసారి ఇంకా కంగారుపడింది వసుధ. కాలేజీ స్టేజీ రాగానే ఇద్దరు దిగారు. వాళ్ల వెంటే ఆ వ్యక్తి కూడా దిగాడు. జయ అతణ్ణి గమనించింది.

"దేవదానుగాడు మనల్ని ఫాలో చేస్తున్నాడు" అంది.

"రానీ చూద్దాం. ఎంతవరకు వస్తాడో" అంది వసుధ కోపంగా.

కాలేజీ ఆవరణలో అడుగుపెట్టారు. ఇద్దరూ కొంతదూరం వెళ్లి వెనుదిరిగి చూశారు. ఆ వ్యక్తి కాలేజీ గేటు దగ్గర నిల్చుండిపోయాడు.

సాయంత్రం కాలేజీ వదిలి వస్తుంటే అతను అక్కడే నిల్చుని వాళ్ల వంక చూస్తున్నాడు. ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు ఆశ్చర్యంగా.

ఇద్దరూ తల వంచుకుని గబగబ బస్‌స్టాప్‌కి నడిచారు. వాళ్లను అనుసరించాడు ఆ వ్యక్తి. బస్సు వెంటనే వచ్చింది. ఇద్దరూ బస్సెక్కేశారు. ఆ వ్యక్తి మాత్రం బస్సు ఎక్కలేదు.

"హమ్మయ్య రక్షించాడు" అనుకున్నారు ఇద్దరూ మనసులోనే.

**నాలుగవ రోజు**

ఇద్దరూ కాలేజీకి కలిసి బయల్దేదారు. మళ్లీ దార్లో నిన్నటి ఆ ఆగంతకుడి గురించి మాట్లాడుకుంటుండగా బస్‌స్టాప్‌కి చేరుకున్నారు. అక్కడ నిల్చున్న ఆ వ్యక్తిని చూసి ఇద్దరి కాళ్లలో ఒణుకు పుట్టుకొచ్చింది.

"ఇక లాభంలేదు. ఏదో ఒకటి మనం ఆలోచించాలి. ఈ దిష్టిబొమ్మను వదుల్చుకోవాలి" అంది కోపంగా జయ.

అంతలో ఆ వ్యక్తి రెండడుగులు ముందుకు వేసి వసుధ దగ్గరగా వచ్చాడు. ఏదో చెప్పాలనుకుంటున్నాడు కాని ధైర్యం చాలటంలేదు. ఒకవేళ మాట్లాడితే ఇద్దరమ్మాయిలు పబ్లిక్ ప్లేస్‌లో తనని దులిపేస్తారన్న భయం. అయితే మెల్లగా అదే స్టైల్‌లో నవ్వాడు.

కళ్లు చిట్లిరచి అతని వైపు తీక్షణంగా చూసింది వసుధ.

కొంచెం భయపడ్డాడు. మెల్లగా రెండు అడుగులు వెనక్కి వేసి నిల్చున్నాడు. బస్సు వచ్చింది. ఇద్దరూ బస్సు ఎక్కారు. కాని ఆ వ్యక్తి ఈసారి బస్సు ఎక్కలేదు. "ఏమిటి నీ చూపులకు బాలుడు బెదిరినట్లున్నాడే" అంది నవ్వుతూ జయ.

**ఐదవ రోజు**

ఉదయం బస్‌స్టాండులో వచ్చి నిల్చున్నారు జయా, వసుధా. ఆ వ్యక్తి కోసం చూశారు. అతను అక్కడ కనిపించకపోయేసరికి పీడ విరగడయ్యిందని సంతోషించారు.

**ఆరవ రోజు**

ఆ రోజు హాయిగా నవ్వుకుంటూ, కబుర్లాడుతూ బస్‌స్టాండ్‌కి వచ్చారు. అక్కడ నిల్చుని ఉన్న ఆ వ్యక్తిని చూసి మళ్లీ వాళ్ల గుండెల్లో రైళ్లు పరుగెట్టడం మొదలెట్టాయి. ఆ వ్యక్తి వాళ్లను తదేకంగా చూస్తున్నాడు. కొంతసేపటికి వాళ్లకి దగ్గరగా వచ్చి నిల్చున్నాడు. అంతలో ఉన్నట్టుండి "ఏయ్ వసుధా! అరుగో మీ నాన్నగారు. పిలవమంటావా!" అని అటుగా వెళుతున్న ఇన్‌స్పెక్టర్ వైపు చేయి చూపింది జయ.

వెంటనే అర్థం చేసుకుంది వసుధ. "వద్దులేవే ఆయన డ్యూటీకి వెళుతున్నారు. పిలిచి బస్‌స్టాండ్‌లో హంగామా చేయించటం దేనికి?" అని ఆ వ్యక్తి వినేలా గట్టిగానే జవాబు చెప్పింది. ఆ మాటలు ఆ వ్యక్తి విన్నాడు. అతని ముఖ కవళికలలో రంగులు మారాయి. అతని నుదిటి మీద రెండు చెమట బిందువులు క్రిందకు జారాయి. బస్ వచ్చింది. ఇద్దరూ బస్సు ఎక్కారు.

**ఏడవ రోజు**

బస్ స్టాండ్‌కి వచ్చారు జయ, వసుధలు. అటు ఇటు పరికించి చూశారు. ఆ వ్యక్తి కనబడలేదు. ఆ తరువాత ఆ రోజు కూడా కనబడలేదు. మరెప్పుడూ ఆ వ్యక్తి అక్కడ కనబడలేదు వాళ్లకి.